# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

NOVEMBER - 1998

# కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్
## (క్రీస్తు సంఘము)
## ఆహ్వానము
## 14వ గొప్ప బైబిల్ సెమినార్

తేదీలు : 1999 జనవరి 17 నుండి 21 వరకు
(ఆదివారం నుండి గురువారం వరకు)

స్థలము : పెర్రికోతమ్ సెమినార్ హాలు
కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్
విద్యుత్ నగర్, కాకినాడ - 533 003

ఉపదేశకులు :
1. Bro. JOHN FORD
2. Bro. BILL MYERS మరియు
3. Sis. NANCY FORD and
4. Sis. BILL MYERS (స్త్రీలకు ప్రత్యేక తరగుతులు నిర్వహించెదరు).

భారతదేశములో పలు ప్రాంతములనుండి ఈ సెమినార్‌కు అనేకులు ఏటేటా వచ్చుచు గొప్ప ఆత్మీయ మేలులు పొందుచున్నారు. గొప్ప సహవాసము, గొప్ప బైబిలు వర్తమానములు అందించబడుచున్నవి. దూరప్రాంతములనుండి వచ్చువారికి ఉచిత భోజన వసతి సౌకర్యములు కలవు. మీరు తప్పక విచ్చేయుండి. మీకు మా ఆహ్వానము.

కాకినాడ,
10-10-98.

**Nehemaih Gootam**
Director

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 63722

Editor :

JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 19 నవంబరు 1998 సంచిక 4


## సంపాదకీయం

### బైబిలు సూచించు దేవుడు
### ( The God of the Bible )

పరిచయము : సమస్త జీవులకు దేవుడు ఆధారభూతుడై యున్నాడని బైబిలు బోధించుచున్నది. "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" (ఆది 1:1). "ఇవన్నియు నా హస్తకృతములు కావా" ? అని ప్రభువు చెప్పుచున్నాడు (అపొ.కా. 7:50). "జగత్తును అందలి సమస్తమును నిర్మించిన దేవుడు..." (అపొ.కా. 17:24). అయితే దీనిని మానవుడెట్లు గ్రహించుకోగలడు ? "ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైనవనియు అందునుబట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడలేదనియు విశ్వాసము చేత గ్రహించుకొనుచున్నాము" (హెబ్రీ 11:3).

# 1. దేవుడున్నాడు

దేవుని గూర్చిన సార్వజనిక విశ్వాసము ఆయన ఉనికిని ఋజువు పరచు చున్నది : "దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన ఉన్నాడనియు, తన్నువెదకు వారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను" (హెబ్రీ 11:6). అన్ని కాలములలో యున్న మానవులు తమకంటె ఉన్నతుడైన వానిని లేక దానిని దేవునిగా భావించి ఆరాధించారు. ఈయారాధనామూర్తికి వారు ఘనత, మహిమ ప్రభావములు ఆపాదించారు. ఇంకోమాటలో ప్రతివాడు దేవుడున్నాడనే నమ్మకముతో జీవించారు, చలించారు. కాబట్టి దేవుడున్నాడు! అట్టి భావములను మానవులలో దేవుడే కల్పించాడని బైబిలు చెప్పుచున్నది (అపొ.కా. 17:27). అది ఎందులకో అపొ.కా. 17:22-31 లను చదివిన మనకు తెలియనగును.

దేవుని పట్ల మానవునికున్న జ్ఞానమును గూర్చి బైబిలు ఇట్లు చెప్పుచున్నది: "ఎందుకనగా దేవుని గూర్చి తెలియశక్యమైన దేదో అది వారి మధ్య విశదమైయున్నది. దేవుడు అది వారికి విశదపరచెను. ఆయన అదృశ్య లక్షణములు అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడుచున్నది. గనుక వారు నిరుత్తరులై యున్నారు (రోమా 1:19-20).

సృష్టింపబడిన వస్తువులను (అనగా దృశ్యమైన వాటిని) ఆలోచించుట వలన అదృశ్యుడైన దేవుని ఉనికి, లక్షణములు గ్రహింపగును. ఏలయనగా అవి దేవుని వలన కలిగినవి. అంటే దేవుని కొరకైన వెదుకులాటను దేవుడు మానవునిలో సహజముగా యుంచాడని గ్రహింపగుచున్నది. అందువలన దేవుని గూర్చిన నమ్మిక మానవునిలో సహజం. అది మానవుని తత్వం. అతడట్లు చేయబడ్డాడు. అట్లయితే మానవులందరు దేవుని గూర్చి ఒకేలాగున ఎందుకు విశ్వాస ముంచరు ? "ఏలయనగా వారు దేవునినెరిగియు ఆయనను దేవునిగా మహిమ పరచలేదు, కృతజ్ఞతాస్తుతులు చెల్లింపను లేదు గాని తమ వాదములయందు వ్యర్థులైరి" (రోమా 1:21).

వారి అవివేక హృదయము అంధకారమయమైనప్పుడు, వారు బుద్ధిహీను లైనప్పుడేమి చేసారు ? (రోమా 1:22-25).

- తాము జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులైరి.

- అక్షయుడగు దేవుని మహిమను - క్షయమగు మనుష్యుల యొక్కయు, పక్షుల యొక్కయు, చతుష్పాద జంతువుల యొక్కయు పురుగుల యొక్కయు ప్రతిమా స్వరూపముగా మార్చిరి.

- తమ శరీరములను పరస్పరము అవమానపరచుకొనిరి.

- దేవుని సత్యమును అసత్యముగా మార్చివేసిరి. మరియు

- సృష్టికర్తకు ప్రతిగా సృష్టమును పూజించి సేవించిరి.

వారు చూడగల (కంటికి కనబడు) విగ్రహములనారాధింప మొదలు పెట్టిరి (రోమా 1:19-32 చదువుము). మనము గమనించదగిన సంగతి యేమంటే - దేవుని సంకల్ప ప్రకారమున్న ఆరాధనను వారు కలుషితము చేసివేసినను, మానవులు (ఎవరో ఒకనిని, లేదా దేనినో ఒకదానిని) ఆరాధించు చున్నారంటేనే దేవుడున్నాడనుట కదియే యొక గొప్ప నిదర్శనమై యున్నది.

మానవువుల నైతిక ప్రవర్తన దేవుడున్నాడని సాక్ష్యమిచ్చుచున్నది : ఈలోకంలో యున్న నైతికపాలన ఒక నైతిక పాలకుని సూచించుచున్నది. మానవుడు నైతిక చట్టానికి బాధ్యుడైన నైతిక జీవి. గనుక ఈ నైతిక పాలనను అమలు పరచే నైతిక ప్రభుత్వమున్నదని గ్రాహ్యమగుచున్నది.

ప్రతి సమాజములోను మానవులు మంచి చెడ్డల విచక్షణ స్థాయి గలవారు. కొన్ని విషయాల్లో ఆయా జనముల మధ్య ఈ స్థాయి యొక్క పరిమాణము వేర్వేరుగ యుండవచ్చును గాని అబద్ధము, నరహత్య, దొంగతనము మొదలగునవి సహజంగా ప్రతి సమాజములోను తప్పుగానే పరిగణించబడును. సత్యము చెప్పుట, అప్పు తీర్చుట యనునవి ప్రతి సమాజములోను రైటే. కొన్ని మంచియని, మరికొన్ని

చెడుయని మానవునికెట్లు తెలియును? అతనికెవరు చెప్పారు. అతని అంతరాత్మయే! మంచి చెడుగులు వున్నవని వాటిలో ఒక దానిని అతడెంచు కోవచ్చని అతని అంతరాత్మయే అతనికి చెబుతుంది. ఎందువలన ? అతడొక నైతిక జీవి ఆయినందువలన. అతడు నైతిక చట్టానికి బాధ్యుడని, నైతిక పాలకుడు (దేవుడు) అతనికి తీర్పు తీరుస్తాడని యది తెలియజేయుచున్నది.

చివరకు న్యాయమే జరుగునని కూడ మానవుడు విశ్వసిస్తాడు. ప్రకృతికి న్యాయం అంటూ యేమీ తెలియనందున, ప్రకృతికి అతీతమైన వాడొకడున్నాడు (దేవుడు). ఆయనే న్యాయం తీర్చును. అంత్య దినమందు దేవుడందరికీ న్యాయమును సమకూరుస్తాడు.

దేవుడున్నాడని ప్రకృతియే సాక్ష్యమిచ్చుచున్నది : "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నది. అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రచురపరచు చున్నది" యని బైబిలు బోధించుచున్నది. దేవుని చేతి పని ఈ లోకమంతా విస్తరించి యున్నది. మానవునికి ఇది విశదమా ? అవును. "అది వారి మధ్యవిశదమై యున్నది. దేవుడు అది వారికి విశదపరచెను" అని బైబిలు చెప్పుచున్నది (రోమా 1:20). దేవుని చేతిపని యొక్క కొన్ని నిదర్శనములేమిటి ? మొదటిగా ఈ విశ్వాన్ని గూర్చియే మనం ప్రశ్నించుకోవచ్చును. ఈ విశ్వము ఏలాగు కలిగెనో నీవు వివరించ గలవా ? అకస్మాత్తుగా జరిగిన ఒక సంఘటన (accident) వలన యిది కలిగెనని కొందరంటారు. ఎవరు యేమీ సంకల్పించకుండగానే యిదంతయు దానికదే కలిగెనని వారంటారు. అట్లనుటలో దానంతటికీ ప్రధమ కారణం అంటూ ఒకటి ఉందని వారంగీకరిస్తారు. అయితే విజ్ఞానశాస్త్రంలో ఆమోదించబడిన సూత్రం, "యేమీ లేకండా యేదీ కలుగదని" (some thing can not come from nothing ) చెప్పుచున్నది.

ఈ విశ్వం అంతా ఒక చట్టము లేక సూత్రము వలన పాలించబడుచున్నది. మానవుని గమనిక వలన, అనుభవము వలన సూత్రములు తయారు చేయబడినవి.

ఉదా:భూమ్యాకర్షణ సూత్రము. అయితే అది మానవుని గమనిక (observa-tion) వలన కలిగింది! అది దోషరహితమైనదా ? మనకేమి తెలియును ? గాలికంటే బరువైన వస్తువులు అంతరిక్షములో వ్రేలాడుచుండుట మనం గమనించుచున్నాము గదా. అయితే భూమ్యాకర్షణ సూత్రము యదార్థమా ? కాదా ? ఏది ఎట్లయినను విజ్ఞాన శాస్త్ర సూత్రములిట్లు తయారు చేయబడ్డాయి.

ఈ విశ్వమంతా ఒక ఆకస్మిక సంఘటన వలన కలిగినదని సలహా యియ్య బడింది గనుక ఈ ఆకస్మిక సంఘటనల సూత్రము యొక్క ఋజువులే మున్నాయి ? ఆకస్మిక సంఘటనలలో లేక ఏక్సిడెంటులలో ఏదైనా ఉద్భవించిందా? తవునని చెప్పవచ్చును ఒక విధంగా. ఉదా: రబ్బరు చెట్టు యొక్క పాల (latex) లో గంధకం అనుకోకుండా పడుట వలన రబ్బరు కనుగొనడం జరిగింది. గనుక ఏక్సిడెంట్‌లలో కూడా ఏదో ఒకటి సంభవిస్తాది. అయితే ఏ రకమైన సంగతులు? ఏదైనా దుర్ఘటనవలన ఏ రకమైన యంత్రం గాని ఎక్కడైనా కలిగిందా ? అగ్ని పర్వతం బ్రద్దలవుట వలన దానిలో నుండి కార్లు ఎన్నడైనా ఉద్భవించాయా ? లేక ఒక తుఫానులో నుండి బస్సులు ఎన్నడైనా కలిగాయా ? లేదా ఒక ఉప్పెన ఎప్పుడైనా చలనచిత్ర కెమోరాను తయారు చేసిందా ? లేనే లేదు! గాని నిజానికి గతములో గాని, ప్రస్తుతములో గాని మన దగ్గరనున్న ఋజువులన్నీ ప్రతి సృష్టానికీ, సృష్టికర్త యొకడున్నాడనే సూత్రాన్ని బలపరచుచున్నాయి. భూమ్యాకర్షణ సూత్రం ఎట్లు తయారు చేయబడిందో యిది కూడా అట్లే. సరిగదా యిది దేవుని వాక్యమైన బైబిలుతో ఏకీభవించుచున్నది. హెబ్రీ 3:4లో అది యిట్లు చెప్పుచున్నది : "ప్రతి యిల్లును ఎవడైన ఒకని చేత కట్టబడును; సమస్తమును కట్టిన వాడు దేవుడే".

నీ చేతి గడియారమునొకసారి గమనించుము. నీవు వ్రాయుచున్న కలము నొకమారు పరిశీలించుము. దీనిని చదువడానికి నీవు వేసుకొన్న కంటి అద్దాలను గూర్చి ఆలోచించుము. అవి ఆకస్మాత్తుగా, ఏక్సిడెంటల్‌గా వాటికవే కలిగాయా? లేక ఎవరైనా వాటిని తయారు చేసారా ?

ఈ విశ్వమంతా ఒక గంభీరమైన యంత్రముతో పోల్చబడింది. దానిలోని ప్రతి భాగము మిగతా వాటితో సమన్వయము కలిగి క్రమ పద్దతిలో చలించు గొప్ప యంత్రముగా ఈ విశ్వమున్నది. ఈ విశ్వమందున్న గ్రహములు నిర్దిష్టమైన ఖచ్చితమైన సమయమును బట్టి చలించునవి గనుక వందల సంవత్సరములకు ముందే (అడ్వాన్సుగా) మనం టైమ్ చెప్పేయొచ్చు. ఉదాహరణకు క్రీ॥శ॥ 2099లో సూర్యోదయం ఖచ్చితంగా ఏ సమయానికి సంభవిస్తాదో ఖగోళ శాస్త్రజ్ఞుడు ముందుగా, ఇప్పుడే చేప్పేయగలడు. ఇదంతా ఒక ఆకస్మిక సంఘటన వలన సంభవించుట సాధ్యమా ? అట్లుకానే కాదు. అది ఒక సూత్రము యొక్క ఫలితము ఆ సూత్రం యేమంటే - "ప్రతి యిల్లును ఎవడైన ఒకని చేత కట్టబడును".

గనుక మన ఖగోళ ప్రపంచములో దేవుని చేతిపని విపులముగా ప్రచురించ బడినను. దేవుని సృష్టిలో యున్న నమూనా (design) యొక్క మరికొన్ని ఋజువులు యేమైయున్నవి ? జ్ఞాన యుక్తమైన నమూనాకు ఉదాహరణగా మానవ శరీరమున్నది. ఆ శరీరములో రెండువందల ఎముకలు, ఐదువందల కండరములు, వీటిని జత కూర్చునట్టి రెండువేల సంధి బంధకములు లేక నరములు ( ligaments). ఇవన్నీ సమన్వయము కలిగి పని చేయుచు అంతా సంఘీభావము గల సంకల్పమునకు సూచనగా యున్నవి. గనుక దావీదుతో కలిసి "నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి" యని చెప్పగలము (కీర్తన **139:14**).

పక్షి యొక్క రెక్కనొక దానిని గమనించుము. దానిలో నమూనా యేదీ లేదని ఎవడు చెప్పగలడు ? మనము తీసికొను ఆహారము జీర్ణింపజేయబడి, రక్తముగా మారి తద్వారా మనకు శక్తినెట్లు ఉద్భవింప చేయునో ఎవరు వివరింప గలరు ? మానవ శరీరములో కొన్ని వందల మీటర్ల రక్తనాళములున్నాయని మరచిపోవద్దు, నల్లటి ఆవు పచ్చని గడ్డి తిని తెల్లని పాలెట్లిచ్చును ? ఇటువంటి ప్రశ్నలు మనం అనేకం వేయవచ్చును. ఇట్టి ప్రశ్నలన్నిటికీ ఒక హేతువు లేకపోలేదు. అదేమంటే నిర్హేతుకంగా ఏదీలేదు! ఆ హేతువునే మనం వెంబడించిన యెడల అదొక ప్రాణి (living agent ) యొద్దకు నడిపించును.

ఒక గ్రంధం ఉంటే దాని గ్రంధకర్త యున్నాడు. శిల్పం వుంటే శిల్పి యున్నాడు. పూలవనం ఉంటే తోటమాలి వున్నాడు. కళాకృతి యుంటే కళాకారుడున్నాడు. సృష్టియుంటే సృష్టికర్త తప్పకయున్నాడు! యిది ప్రత్యక్ష సత్యము. దీనిని కాదనలేము. దానికి ఋజువులేమీ అక్కరలేదు. బుద్ధిహీనులు మాత్రమే దేవుడు లేడని తమ హృదయములో అనుకొందురు (కీర్తన 14:1).

## 2. దేవుడేమై యున్నాడు ?

దేవుడున్నాడని మనం అంగీకరరించినను, దేవుడేమైయున్నాడనే ప్రశ్న మనకు తప్పక ఉద్భవించును. ఈ విశ్వము యొక్క అంచులలో ఎక్కడో యుంటూ ఆయన సృష్టిని గూర్చి ఆసక్తి లేకుండా యున్నాడా ? ఆయన ఎట్లుంటాడు ? దేవుడెట్లుంటాడో మనం తెలిసికోవాలంటే ఆయన తన్ను తానే మనకు బయలు పర్చుకోవాలి. అప్పుడు మాత్రమే ఆయన ఎట్టివాడో -మంచివాడో, చెడ్డవాడో, దయాళుడో, క్రూరుడో తెలిసికొనగలము. దేవుని యొక్క తత్వాన్ని గూర్చి, పనిని గూర్చి బైబిలు మనకు ఇట్లు బయలుపరచుచున్నది :

**దేవుడు మానవునినుండి ప్రకృతి నుండి వేరుగా యున్నవాడు :** మానవ క్రియలు దేవునిలో మార్పు తీసికొని రావు గనుక దేవుడు ఎల్లప్పుడు ఒకే రీతిగా యుండును, మానవుల నేరములను బట్టియు పాపములను బట్టియు దేవుడు అపరాధికాడు. ఏలయనగా ఆయన వారి క్రియలలో పాలివాడుకాడు. సమస్తము కలుగక మందునుండి ఆయన యున్నాడు, సమస్తానికి వేరుగా ఆయన యున్నాడు. అయితే ఆయన మానవుల యెడల, వారి క్రియల యెడల అనాసక్తి పరుడని దీని అర్థము కాదు. ఈ విషయంలో దేవుని తత్వమును బైబిలు వివరించుచున్నది - ఆయన మానవుల క్షేమమును కాంక్షించుచున్నాడు.

**దేవుడు సర్వశక్తిమంతుడు :** బైబిలులో వర్ణించబడిన దేవుని గంభీర కార్యము లన్నీ ఆయన నిత్యశక్తికి తార్కాణమై యున్నవి. ఆయన లోకమునెట్లు

సృజించాడో గమనించుము: "దేవుడు - వెలుగు కమ్మని పలుకగా వెలుగు కలిగెను" (ఆది.కా. 1:3). మరల, "దేవుడైన యెహోవా నేటమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవ వాయువును ఊదగా నరుడు జీవాత్మ అయెను" (ఆది.కా. 2:7). ఈ వచనముల నుండియే ఆయన యొక్క సర్వశక్తి విపులీకరించబడినది.

దేవుడు సర్వజ్ఞాని : దేవుడు సర్వజ్ఞానియై యున్నాడు. అంటే ఆయన జ్ఞానమునకు అంతులేదని యర్ధము. అనాది కాలమునుండి దేవుడు సమస్తమును ఎరిగి యున్నవాడని బైబిలు చెప్పుచున్నది (అపొ.కా. 15:17). సృష్టి జరిగిన నాటినుండి నేటివరకు దేవునికి తెలియకుండా యేదీ జరుగలేదు. "ఆయన భూమ్యాంతము వరకు చూచుచున్నాడు. ఆకాశము క్రింది దానినంతటిని తెలిసి కొనుచున్నాడు" (యోబు 28:24). "యెహోవా కన్నులు ప్రతి స్థలముమీద నుండును. చెడ్డవారిని మంచివారిని అవి చూచుచుండును" (సామె 15:3).

దేవుడు ఆత్మయై యున్నాడు : "దేవుడు ఆత్మగనుక ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను" (యోహాను 4:24). ఆయనకు భౌతిక ఆకారం యేమీలేదు,

దేవుడు మార్పులేనివాడు : "యెహోవానైన నేను మార్పులేనివాడను" అని ఆయన చెప్పుచున్నాడు (మలాకీ 3:6). మానవులు, వారి చుట్టూయున్న సంగతులు నిరంతరము మార్పుజెందుచున్నట్లు ఆయన మార్పుజెందదు. ఆయన ఎల్లప్పుడు ఒకే రీతిగ యుండును. ఆయన నిత్యుడు. కాలము లేనివాడు. "ప్రభువు దృష్టికి ఒక దినము వెయ్యి సంవత్సరముల వలెను, వెయ్యి సంవత్సరములు ఒక దినము వలెను ఉన్నవి" (2పేతురు 3:8). ఆయన పరిపూర్ణుడు గనుక సరిదిద్దు కొనవలసినవి, పునరుద్ధరింపవలసినవి యేమీ ఆయనకు లేవు.

దేవుడు పరిశుద్ధుడు : "నేను పరిశుద్ధుడనై యున్నాను" అని ఆయన చెబుతున్నాడు (1పేతురు 1:16). దేవుడు పాప కళంకితుడు కాడు గనుక పవిత్రుడు.

ఆయన ఎల్లవేళల మంచివాడు, అబద్ధమాడజాలని వాడు (హెబ్రీ 6:18). ఆయన పరిపూర్ణుడు గనుక మనమును పరిపూర్ణులముగా యుండాలని కోరుచున్నాడు (మత్తయి 5:48). ఆయన పరిశుద్ధుడు గనుక మనమును పరిశుద్ధులముగా యుండాలని ఆయన కోరుచున్నాడు (1పేతురు 1:16).

**దేవుడు ప్రేమయై యున్నాడు :** "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). "అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడి పరచు చున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా 5:8). "దేవుడు ప్రేమయై యున్నాడు" (1యోహాను 4:8). ప్రేమకంటే దేవుని వర్ణించు మరొక లక్షణము ఇంకొకటి మనకు కనబడదు.

**దేవుడు నిత్యుడు :** దేవుడు "ఉన్నవాడను అనువాడనై యున్నానని" చెప్పుచున్నాడు (నిర్గమ 3:14). దేవునికి ఆరంభము లేదు, అంతము కూడ లేదు. ఆయన ఎల్లవేళలా యుండెను. ఎల్లవేళలా యుండును. అన్నిటికి ఆధార భూతుడును, ఆరంభకారణము కూడా ఆయనే. ఆయన లేకుండా యేదీ కలుగ లేదు. సమస్త జీవరాసుల జీవమునకు ఆధారభూతుడును, జీవనదాతయు ఆయనే.

**దేవుడు అనుగ్రహం, కాఠిన్యము గలవాడు :** "కాబట్టి దేవుని అనుగ్రహమును, కాఠిన్యమును అనగా పడిపోయిన వారిమీద కాఠిన్యమును.... చూడుము" (రోమా 11:22). మత్తయి 19:17లో యేసు చెప్పినట్లు దేవుడు తప్ప మంచివాడింకొకడులేడు (లూకా 18:19). అయితే దేవునికి మరొక లక్ష[illegible]మున్నట్లు కూడ బైబిలు చెప్పుచున్నది. ఆయన ఎల్లవేళలా అవిధేయతను [illegible]వాడు. అవిధేయతకంటే ఆయనను కలత పరచేది ఇంకొకటి ఉండదు. "బలులు అర్పించుటకంటె ఆజ్ఞను గైకొనుటయు పొట్టేళ్ళ క్రొవ్వు అర్పించుట కంటె మాట వినుటయు శ్రేష్ఠము" (1సమూయేలు 15:22).

ఆదాము హవ్వలు పాపము చేసినప్పుడు దేవుడు వారిని ఏదెను వనమునుండి వెళ్ళగొట్టారు (ఆది.కా. 3:22-24). నాదాబు అబీహులు యెహోవా తమకాజ్ఞాపింపని వేరొక అగ్నిని ఆయన సన్నిధికి తేగా, యెహోవా సన్నిధినుండి అగ్ని బయలుదేరి వారిని కాల్చివేసెను (లేవీ 10:1-2). వీరిపై అగ్నిని పంపిన ఈ దేవుడే అంత్యదినమందు అవిధేయులందరినీ అగ్నిపాలు చేయును. "మనుష్య కుమారుడు తన దూతలను పంపును; వారాయన రాజ్యములోనుండి ఆటంకము లగు సకలమైన వాటిని దుర్నీతి పరులను సమకూర్చి అగ్ని గుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లుకొరుకుటయును ఉండును" (మత్తయి 13:41-42). దేవుని కాఠిన్యమును బైబిలు బోధించు రీతిగా గుర్తించక పోవుట వలన అనేకులు విషాదకరమైన పొరబాటు చేయుచున్నారు.

**దేవుడు యదార్థవంతుడు :** "ఆయన పక్షపాతము లేకుండ క్రియలను బట్టి ప్రతి వానిని తీర్పు తీర్చు తండ్రి" (1పేతురు 1:17). ఆయన పక్షపాతము లేనివాడని గ్రహించుటకు అపొ.కా. 10:33-35 ను చదువుము.

**దేవుడు రక్షింపబడిన వారందరికీ నిత్య గృహమునిచ్చువాడు :** అన్ని యుగములలోను పాపమునుండి విమోచింపబడిన వారికి ఆయన నిత్య గృహములో స్థానమననుగ్రహించును. యేసు తన శిష్యులకిట్లు చెప్పాడు : "మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్లి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును" (యోహాను 14:1-6). యిది విధేయులైన వారికి నిర్దేశించబడిన స్థలము.

## ముగింపు

ఈ పాఠములో ప్రకృతిలో బయలు పరచబడుచున్న బైబిలు సూచించు దేవుని గూర్చి కొంత మనము పఠించాము. ఆయన తత్వాన్ని కొంత మట్టుకు గ్రహించుకొనుటకు గాను, ఆయన బైబిలులో బయలు పరచబడిన విధానమును

గమనించాము. ఆయన సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞాని, సర్వాంతర్యామి, ఆయన ప్రేమయై యున్నాడు, పరిశుద్ధుడు, మంచివాడు, కఠినుడు, న్యాయవంతుడు.

క్రీస్తుద్వారా దేవుడు తండ్రిగా తన్నుతాను బయలుపరచుకొన్నాడు. ఆయనను మనము ప్రేమించు తండ్రిగా భావించాలని దేవుని యొక్క చిత్తమై యున్నది. మనలను కుమారులను గాను, కుమార్తెలను గాను ప్రేమించి సంరక్షించాలని ఆయన కోరికయై యున్నది. సత్యములో దేవుని కుమారులైన వారు దేవుని చూచెదరని యేసుప్రభువు చెప్పారు (మత్తయి 5:8).

## ఆకాశములు దేవుని ..... వివరించుచున్నవి

## (The Heavens declare God)

గత పాఠములో బైబిలు సూచించు దేవుని గూర్చి తెలిసికొంటిమి. ఆ పరిశుద్ధ గ్రంధము దేవుని ఉనికిని గూర్చి నిత్యము బోధించుచున్నది. ఒక వ్యక్తిగత దేవుని ఉనికియే క్రైస్తవ్యమునకంతయు మూలాధారము. ఈ పునాదిపై క్రైస్తవ్య మంతయును ఆధారపడియున్నది. దీనినుండి దేవుని తొలగించిన క్రైస్తవ్య మంతయును కూలిపోవును. అనేకులు "దేవుడు ఉన్నాడా" యని ప్రశ్నలు వేస్తూ యుంటారు. బైబిలు గ్రంధమయితే ఒక గొప్ప నిజ దేవుడు ఉన్నాడని బోధించు చున్నది. ఆయన అన్నిచోట్ల యున్నవాడు గనుక సర్వాంతర్యామి. ఆ దేవుడు సమస్తమును ఎరిగినవాడు గనుక సర్వజ్ఞాని. ఆ దేవునికి ఏదియును అసాధ్యము కాదు గనుక ఆయన సర్వశక్తిమంతుడు. బ్రహ్మాండమైన ఈ విశ్వమంతటిని చేసినవాడు దేవుడని, దానిని కొనసాగించువాడు దేవుడని బైబిలు బోధించుచున్నది. "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రచురపరచుచున్నది" యని బైబిలు బోధించుచున్నది. అయితే దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు అని కూడా అది బోధించుచున్నది (కీర్త 19:1; 14:1).

# వాస్తు శాస్త్రవేత్త

సర్వజ్ఞానియు, సర్వశక్తిమంతుడునై లోకమంతటిని సృష్టించి పిచ్చుకపాటును సహితము కనిపెట్టుచున్న యట్టి దేవుని ఉనికిని గూర్చి మనకు సంతృప్తి కరమైన ఆధారములు కలవా ? అవి ఉన్నవో లేవో ఈరోజు మనం గమనించుదాం. ఈ విశ్వమంతటిలోను దేవుని గూర్చి మనకు దొరుకు ఋజువులను పొందు పరుచుదాం. భూమియు, దానిచుట్టునున్న గ్రహములును ఒక బ్రహ్మాండమైన వాస్తు శాస్త్రపు విద్యయై యున్నది. బ్రహ్మాండమైన ఈ విశ్వములో భూమి ఒక చిన్న భాగమైనందున ఈ విశ్వము మానవజ్ఞానమునకు మించినదై యున్నది. అంతరిక్షమును ఏలుచు తన రధములో పయనించు పగటి రాజును గమనించుము. తన తెల్లబారిన కాంతిలో రేజీకటిని ధైర్యముతో పారద్రోలుచు ఆకాశ విశాలములో నెగురు రేరాణిని నొకమారు చూడుము. రాత్రివేళ విలువైన ముత్యములతో పొదగబడినట్లగుపడు ఆ యంతరిక్షము నొకసారి పరిశీలించుము. ప్రకృతి నేత్రములతో ఒకడు 6వేల నక్షత్రములనే చూడగలుగునని అంచనా వేయబడెను. మిక్కిలి శక్తివంతమైన దూరదర్శిని సహాయముతో ఇంచుమించు 40 కోట్ల నక్షత్రములను చూడవచ్చునని కూడా అంచనా వేయబడెను. అయితే దూరదర్శినివలన కనుగొనబడలేని కోటానుకోట్ల నక్షత్రములింకను యున్నవి. భూమికిని, మిగిలిన గ్రహములకును మానవజ్ఞానము ఊహించలేనంత దూరము కలదు. చంద్రుడు భూమికి ఇంచుమించు 3లక్షల మైళ్ళ దూరములో యున్నాడు. భూమికిని, సూర్యునికిని గల మధ్య దూరాన్ని బట్టి చూస్తే ఇది బహు తక్కువ. సూర్యుడు భూమికి 9కోట్ల మైళ్ళ దూరములో యున్నాడు. అంతేకాదు భూమికి అతి సమీపములో నున్న నక్షత్ర సమూహము 200 కోట్ల మైళ్ళ దూరములో నున్నవి. వెలుగు సెకనుకు 186 వేల మైళ్ళు ప్రయాణించునని ఎరిగిన తరువాత ఖగోళ దర్శకులు దూరమును కొలుచుటకు "కాంతి సంవత్సరమును" ప్రవేశపెట్టిరి. సెకనుకు 186 వేలమైళ్ళ చొప్పున వెలుగు ఒక సంవత్సరములో ప్రయాణించు దూరమును "కాంతి సంవత్సరము" తెలియజేయును. కొన్ని నక్షత్రములు

భూమినుండి 32 కాంతి సంవత్సరముల దూరములో కలవు. మరికొన్ని అంతకు మించిన దూరములో కూడా కలవు. ఈ విశ్వమంతయును ఒక గంభీరమయిన వాస్తు శాస్త్రపు విద్యయని మనము అంగీకరింపక తప్పదు. అయితే ఈ వాస్తు శాస్త్రవేత్త యెవరు ? అనే ప్రశ్న మనలో తప్పక ఉద్భవించును. ఈవాస్తు శాస్త్రవేత్త దేవుడే యని బైబిలు బోధించుచున్నది.

## గణితజ్ఞుడు

విశ్వమంతటిలోను చక్కటి క్రమము గలదు. ఆధునిక శాస్త్రజ్ఞులు చంద్ర మండలముపైకి మానవుని పంపించిన తరువాత, ఆయా గ్రహములపైకి రాకెట్లను (Space Craft ) పంపించి, మానవునికి నివాసయోగ్యముగా భూమి ఒక్కటి మాత్రమే యున్నదని తెలుసుకొనిరి. బుధుడు ( Mercury ) అను గ్రహము భూమికంటె 7 రెట్లు ఎక్కువ సూర్యరశ్మిని పొందుచున్నది. అంటే వేసవిలో ఆ గ్రహమంతయును 700 డిగ్రీలకంటే ఎక్కువ ఉష్ణోగ్రతతో అగ్నిగుండమువలె యుండి మనుష్యులుగాని, జంతువులు గాని జీవించడానికి యోగ్యముకాని స్థితిలో నుండునన్న మాట ! వరుణుడు (Uranus ) అను వేరొక గ్రహము మన సూర్యకుంటుంబములో కలదు. అది సూర్యునినుండి భూమికంటె వంద రెట్లు దూరముగ నున్నది. అందువలన ఇది బహు శీతలమయినది. ఈ గ్రహమందలి ఉష్ణోగ్రత సున్నకంటె 2-3 వందల డిగ్రీలు తక్కువగుటచే ఏ జీవరాశియు అక్కడ జీవించుట అసాధ్యము. మానవ నివాస యోగ్యమగు భూమి తప్ప సూర్య కుటుంబములోని గ్రహములన్నిటికిని ఈ వాదము వర్తించును. భూగ్రహమందు కూడా చాల ఆశ్చర్యకరమయిన క్రమమును మనము చూడగలము. భూమి చుట్టుకొలత ఇంచుమించు 25 వేల మైళ్ళున్నది. అనగా భూవ్యాసము 8 వేలమైళ్ళు అయితే భూవ్యాసము 8 వేల మైళ్ళు కాక 9 వేల మైళ్ళున్న యెడల భూమ్యాంతర ఉష్ణోగ్రత బహు ఎక్కువై అది మానవ నివాస యోగ్యము కాని గ్రహము వలె యుండును. భూవ్యాసము 7 వేల మైళ్ళు మాత్రమే అయితే భూమ్యాంతర ఉష్ణోగ్రత బహు తక్కువై అది జీవనయోగ్యము కానిదగును. ఒక ఆకస్మిక సంఘటన ఇంత

విశేష క్రమమునకు కర్తయగుట అసాధ్యము. అయితే ఇంతటి గంభీర క్రమమును విశ్వమంతటిలోను ఏర్పరచిన జ్ఞానియెవడు? ఆజ్ఞాని దేవుడే యని బైబిలు బోధించుచున్నది. భూమితో సహా మిగిలిన అంతరిక్ష గోళములు ఒకదానికొకటి అతి ఖచ్చితముగా తమ క్రమ ప్రకారము చలించుట మరింత ఆశ్చర్యకరమైన సంగతి. సూర్యుడు నిద్రపోవుట నీవు ఎన్నడైననూ గమనించితివా ? లేదు; దినదినము, సంవత్సర సంవత్సరము భూమి తన ఇరుసుపై 24 గంటల కాలములో తన చుట్టూ తాను తిరుగుచు ప్రమాదములు ఏమియు లేకుండగనే మనకు రేయింబవళ్ళ నిచ్చు చున్నది. ఖగోళ దర్శకులు గ్రహ చలనమును గమనించి ప్రతి సంవత్సరం ఫలాని దినమున ఇన్ని గంటల ఇన్ని నిమిషములకు సూర్యగ్రహణము లేక చంద్రగ్రహణము జరుగగలదని ముందుగానే చెప్పగల్గునంత ఖచ్చితముగా ఈ గ్రహములు చలించుచున్నవి. ఇంత ఆశ్చర్య కరమైన అతి ఖచ్చిత గణితక్రమము నెరిగిన ఈ గణితశాస్త్రజ్ఞుడు ఎవరు ? ఈ గణితజ్ఞుడు దేవుడు అని బైబిలు బోధించుచున్నది.

భూమియు, భూవాతావరణమును రసాయనిక మూలకములతో నిండి యున్నవి. ఈ మూలకములన్నిటిని మిశ్రమము చేసిన వాడంటూ ఒకడుండెనని ఆవే చెప్పగలవు. విజ్ఞానశాస్త్రపు మిశ్రమము ఎక్కడ ఉండునో అక్కడ దానికి కర్తయైన జ్ఞాని తప్పక యుండును. ఉదాహరణకు మనము నీటిని గమనించుదాం. నీరు ఎట్లా తయారైనది ? అది రెండు పాళ్ళు హైడ్రోజన్‌తోను, ఒకపాలు ఆక్సిజన్‌తోను తయారైనది. Chemistry విద్యార్థిని ఎవరిని అడిగినా $H_2O$ అను ఈ గుర్తు నీటిని లేదా అందున్న రసాయనిక మూలకముల మిశ్రమమును తెలియజేయు చున్నదని ఇట్టే చెప్పగలరు. హైడ్రోజన్ వాయువు మిక్కిలి సులభముగ మండెడు గుణము గలది. అగ్ని తయారు చేయుటకు ఆక్సిజన్ వాయువు తప్పక యుండ వలెను. అయినను ఈ రెండు రసాయనములను ఇంతకు ముందు చెప్పిన నిష్పత్తిలో కలిపిన యెడల మనకత్యవసరమైన నీరు లభించును. భూవాతావరణము లో అనేక వేలకొలది ఇట్టి క్రమబద్ధమయిన

మిశ్రమములున్నవి. అవన్నియును వాటంతటవే కలిగినవని వివేకులు ఎవరు చెప్పలేరు. అయితే ఈ రసాయనిక శాస్త్రవేత్త యెవరు ? ఆయన దేవుడు అని బైబిలు బోధించుచున్నది. ప్రకృతి పుటలలోని మహనీయ కళలను వర్ణించుట మనకు అసాధ్యము. మనము సుందర సూర్యాస్తమయమును చూచితిమి. పశ్చిమ క్షితిజములోనికి సూర్యుడు మెల్ల మెల్లగా దిగుచు, ఆకాశమునంతటినీ తన చిత్రవిచిత్ర రంగులతో నింపుచూ ప్రఖ్యాత కవులనుండి, సామాన్య మానవుని వరకు అందరినీ ఉత్తేజపరచుట మీరు గమనించే యుంటారు. రకరకాల గులాబీలు, చేమంతులు, సన్నజాజులలో ఒక పరిపూర్ణ మహనీయ చిత్రకారుని యొక్క కృషిని గమనించి వర్ణించుటకు నిజానికి మనకు సమయము చాలదు.

## ప్రాణదాత

నిజానికి భూమిపై మనము జీవించుచున్నాము అంటే మనకు ప్రాణము పోసిన ప్రాణదాత యెవరు ? అని అడుగక తప్పదు. ఈనాడు మానవుడు విజ్ఞానమును బట్టి అనేక సంగతులను సాధించి యున్నాడు. అయితే ప్రాణమును మాత్రము అతడు తయారు చేయలేడు. చనిపోయిన జీవిని తిరిగి అతడు బ్రతికించలేడు. భూమిపై వివిధ స్థాయిలలో జీవరాసులుండుటచే ఈ జీవనదాత యెవరు ? అని మనమడుగక తప్పదు. ఆయన దేవుడే యని బైబిలు బోధించు చున్నది. ఈ గంభీర విశ్వమందున్న ఋజువులలో మనమొక సృష్టికర్తను, గణితజ్ఞుని, విజ్ఞాన శాస్త్రవేత్తను, ప్రసిద్ధ కళాకారుని, ప్రాణదాతను చూడగలుగు చున్నాము. ప్రపంచమందున్న సమస్తాశ్చరములకు వెనుకనున్న గంభీరవ్యక్తియే దేవుడు. దీనికింక తిరుగులేదు. ఆకాశములు దేవుని మహిమను వివరించు చున్నవి. అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచుచున్నది యని దావీదు మహారాజు సత్యమునే పలికెను. అందువలననే బైబిలులోని మొదటి వచనమే "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" యని చెప్పుచున్నది. సమస్తమునకు కర్తయైన ఆ నిజదేవుని మనము తెలుసుకొను నిమిత్తము యేసుక్రీస్తు ఈలోకమునకు వచ్చెను. ఆ దేవుని చెంతకు మనము చేరవలెననిన మనము

యేసుక్రీస్తునందు విశ్వాసముంచి, మన పాపముల విషయమై మారుమనస్సునొంది, ఆయన నామమును ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము నొందవలెను. అట్లు చేసి నిజ దేవుని నెరిగి ముక్తినొందుట సాధ్యమగును.

- జాషువా గూటం.

## యాగము
## (Sacrifice)
### (గతసంచిక తరువాయి)

**II.** శరీరయాగము :- దేవుడు, స్తుతియాగమే గాక శరీరయాగమును కూడ అర్పించగోరుచున్నాడు. యేసుక్రీస్తు గొల్గొతా కొండపై తన శరీరమును అర్పించి మానవకోటిని విమోచించినాడు. ఏలయన ? "... తన్నుతాను అర్పించుకొనినపుడు ఒక్కసారే ఈ పనిచేసి ముగించెను" (హెబ్రీ 7:28). కనుక అట్టి శరీరయాగ ఫలములు ఫలించ గోరుచున్నాడు. కావున శరీరయాగమెట్లు సమర్పించవలెనో బైబిలు యొద్దకు వెళ్లాము.

1. అపోస్తులుడైన పౌలు రోమీయులకు లేఖ వ్రాస్తూ "కాబట్టి సహోదరులారా; పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవయాగముగా మీ శరీరరములను సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్ము్మను బతిమాలుకొనుచున్నాను" (రోమా 12:1-2).

2. మరొక సందర్భములో పౌలు శరీరమును గూర్చి యిట్లు చెప్పుచున్నాడు. "మరియు మీ అవయవములను దుర్నీతి సాధనములుగా పాపమునకు అప్పగింపకుడి, అయితే మృతులలోనుండి సజీవులమనుకొని, మిమ్మునుమీరే దేవునికి అప్పగించుకొనుడి..మీ అవయవములను నీతికి సాధనములుగా దేవునికి అప్పగించుడి" (రోమా 6:13). అనగా మన శరీరములోని ప్రతి అవయవమును నీతికి దాసులుగా అప్పగించవలసి యున్నది (రోమా 6:19 చూడుము). దావీదు భక్తుడు కూడా "నా ప్రాణమా యెహోవాను

సన్నుతించుము, నా అంతరంగమునన్నున్న సమస్తమా, ఆయన పరిశుద్ధ నామమును సన్ను తించుము" (కీర్త. 103:1) అని ప్రార్థించుట గమనార్హము. అదియును గాక, దేహము (శరీరము)తో దేవుని మహిమ పరచుడి అని పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నాడు (1కొరింథీ 6:15,20). కాబట్టి మన శరీరమును పవిత్రముగా వుంచి మనలను మనము శరీరయాగముగా దేవునికి అర్పించ వలసియున్నది.

III. ఉపకారయాగము :- రక్షించబడిన ఆత్మలు బలపర్చబడుటకును, సంఘములు అభివృద్ధి చెందుటకును "ఉపకారము" అత్యంతవసరమై యున్నది; ఉపకారమనునది ద్రవ్యము అర్పించుట ద్వారాను, పరిచర్య చేయుట ద్వారాను యాగముగా అర్పించవలసి యున్నది. అందుకే హెబ్రీ గ్రంధకర్త యిట్లు చెప్పుచున్నాడు. "ఉపకారమును, ధర్మమును చేయ మరచిపోకుడి, అట్టి యాగములు దేవునికిష్టమైనవి" (హెబ్రీ 13:16). ఈ వాక్యమందు "యాగములు" అను బహువచనం ప్రయోగించబడినది; అనగా 1. ఉపకారము చేయుట 2. ధర్మము (కానుకలు) యిచ్చుట అను విషయములు యాగము అను విషయము మరచిపోరాదు.

ముందుగా, కానుక (ధర్మము)లు విషయమై ఆలోచించుదాము. పౌలు బర్నబాలు అంతియొకయలో సేవచేయుచుండగా భూలోకమంతటికి గొప్ప కరవు రాబోవుచున్నదని ఆగబు ప్రవక్త ద్వారా విని, అచ్చట ప్రతివాడు తమ తమ శక్తికొలది ధనమును ప్రోగుచేసి పౌలు బర్నబాల ద్వారా యూదయలోని సహోదరులకు పంపిరి (అ.కా. 12:27-30). ఈ ఉపకార ద్రవ్యము అచ్చటి సంఘాభివృద్ధికి ఎంతో దోహదపడియుండవచ్చును (1కొరింథీ 16:3 చూడుము). ఉపకార ద్రవ్యము దేవుని మహికరమైనది (2కొరింథీ 9:6,7). యెరూషలేములోని బీదలైన పరిశుద్ధుల కొరకు మాసిదోనియా వారు, అకయవారు కొంత సొమ్ము చందాగా పంపిరి. (రోమా 15:26,27). ఇది దేవునికి వారు సమర్పించిన యిష్టమైన ఉపకారయాగము. "నాకు సమృద్ధిగా కలిగియున్నది. మీరు పంపిన వస్తువులు ఎపఫ్రొదితు వలన పుచ్చుకొని ఏమియు తక్కువ లేక యున్నాను; అవి మనోహరమైన సువాసనయు,

దేవునికి ప్రీతికరమును ఇష్టమునైన యాగమునై యున్నది" (ఫిలిప్పీ 4:18). చూచితిరా, ఒక సువార్తికునికి చేసిన ఉపకారము కూడా దేవునికి యిష్టమైన యాగమునై యున్నది. చాలామంది క్రైస్తవులు సువార్తికులను ఆదరించుటలో శ్రద్ధ చూపుటలేదు. కాబట్టి ఒక సువార్తికునికి చేసిన ఉపకారము అది దేవునికి చెందినదై యున్నది. అందుకే "... సువార్త ప్రకటించువారి పాదములెంతో సుందరమైనవి" (రోమా 10:15). అని పరిశుద్ధ గ్రంధము ప్రబోధించుచున్నది (యెషయా 52:7 చూడుము).

నీ (మనము చేయు) ఉపకారము(యాగము) బలవంతము చేతనైనట్టు కాక, స్వేచ్ఛా పూర్వకమైనదిగా వుండవలెనని, నీ సమ్మతి లేక యేమియు చేయుటకు నాకిష్టము లేదని పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నాడు (ఫిలే:14;2కొరింథీ 9:7 చూడుము). మరియు "మనము సత్యమునకు సహాయకులమవునట్లు అట్టివారికి (ఉపకారము అవసరమైన వారికి) ఉపకారము చేయబద్ధులమై యున్నాము" (3యోహాను:8).

ఉపకారయాగములో కానుకలు యిచ్చుట అను విషయము పరిశీలించినాము. ఇప్పుడు ఉపకారయాగములోని పరిచర్య ధర్మమును గూర్చి తెలిసికొందాము. పౌలు కొలస్సయి సంఘమునకు లేఖ వ్రాస్తూ "మరియు ప్రభువునందు నీకు అప్పగింపబడిన పరిచర్యను నెరవేర్చుటకు దానిని గూర్చి జాగ్రత్తపడమని అర్ఖిప్పుతో చెప్పుడి" (కొల. 4:17). అని చెప్పుచున్నాడు. కాబట్టి పరిచర్య అతి ముఖ్యమైనదని గోచరమగుచున్నది. ఈ పరిచర్య 3రకములు. 1. వాక్యపరిచర్య, 2. సంఘపరిచర్య, 3. సువార్తకునికి పరిచర్య.

1. వాక్యపరిచర్య :- వాక్య పరిచర్య అనగా సువార్త ప్రకటించుటయే. ఒకడు రక్షింపబడవలెనన్న వాక్య పరిచర్య ఎంతో అవసరమైయున్నది. వారు "విశ్వసింపని వానికి ఎట్లు ప్రార్ధన చేయుదురు ? వినని వానిని ఎట్లు విశ్వసించుదురు ? ప్రకటించువారు లేకుండ వారెట్లు విందురు ?

ప్రకటించువారు పంపబడని యెడల ఎట్లు ప్రకటించుదురు ?" అని రోమా పత్రిక 10:14.15లో తెలియపరచబడియున్నది. అనగా వాక్యము ప్రకటింప బడుట దేవుని చిత్తమై యున్నది. పేతురు పెంతెకోస్తు దినమున వాక్యము ప్రకటించగా ఒక్క దినమందు యించుమించు 3వేలమంది రక్షింపడిరి. (అ.కా. 2:14-42 చూడుము). అటులనే ధర్మశాస్త్రమునందు మిక్కిలి విశ్వాసం కలిగిన నపుంసకుడు ఫిలిప్పు సువార్త ప్రకటించగానే మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందెను. అపొస్తలుల సువార్త ప్రకటన వినిన వేలకొలది యూదులు సంఘమందు చేర్చబడిరి. కాబట్టి వాక్య పరిచర్య గొప్ప యాగమై యున్నది.

2. సంఘ పరిచర్య :- ఒక స్థానిక సంఘము అభివృద్ధి చెందవలెననిన సంఘ పరిచర్య ఎంతో అవసరమైయున్నది. సంఘాభివృద్ధికి సంఘనాయకులే గాక సంఘములోని ప్రతి వ్యక్తి ఏదో కొంత వారి పరిధిని బట్టి సమర్పణ చేయవలసి యున్నది. ఉదా:- యొప్పే సంఘములో "తబితా" అను ఒక యవ్వనురాలు వుండెను. ఆమె చేసిన సత్క్రియలను బట్టి ధర్మకార్యములను బట్టి సంఘము ఆమె యెడల ఎంతో ఆదరాభిమానములు కలిగి యుండిరి. విధవరాండ్రకు ఎంతో పరిచర్య చేసియుండెను. ఆమె చనిపోయినపుడు, ఆసంఘములోని విధవరాండ్రు ఏడ్చుచు ఆమె కుట్టిన అంగీలు, వస్త్రములను పేతురుకు చూపి ఎంతో అంగలార్చిరి. నిజముగా ఆమె చేసిన పని దేవునికి ప్రీతికరమైన యాగమై యున్నది.

3. సువార్తికులకు పరిచర్య :- పరిచర్య యాగములో ఏ మాత్రం తక్కువది కాదు. అందులో సువార్తికులకు చేయు పరిచర్య ఎంతో ఘనమైనది. అంతియొకయ సంఘములో కొందరు ప్రవక్తలు వుండిరి. వారు వాక్యమును ప్రకటించు చుండిరి. అయితే పరిశుద్ధాత్ముడు వారిలోనుండి పౌలును, బర్నబాను సువార్త పనికొరకు ప్రత్యేక పరచుమని వారితో చెప్పెను. అప్పుడు పౌలు, బర్నబాలు అనేక ప్రాంతములలో వాక్య పరిచర్య చేసి సలమీలో

యూదుల సమాజ మందిరములో వాక్యము ప్రకటించుచున్నప్పుడు మార్కు అను మారుపేరు గల యోహాను వీరికి ఉపచారము చేయుచుండెను (అ.కా. 13:1-5 చూడుము). మరియు పౌలు ఇంకను అనేక ప్రాంతములు తిరిగి వాక్యము ప్రకటించుచు ఎఫెస్సుకు వచ్చి వాక్యమును ప్రకటించినపుడు గొప్ప ప్రభావముతో వాక్యము ప్రబలమయ్యెను. పౌలు ఆసియాలో కొంతకాలము వుండనెంచి తనకు పరిచర్య చేయువారిలో తిమోతియు, ఎరస్తు అనువారిని మాసిదోనియాకు పంపెను (అ.కా. 19:21,22 చూడుము). కాబట్టి సువార్తికులకు చేయు పరిచర్య ఎంతో ఘనమైనదని స్పష్టమగుచున్నది. దీనిని గూర్చి ".... ఉత్తమమైన వాటిని గూర్చి సువార్త ప్రకటించు వారి పాదములెంతో సుందరమైనవని" రోమా 10:14,15లో పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నాడు. ఓడ బద్దలైనపుడు మెలితె ద్వీపవాసులు పౌలును, అతనితోనున్న వారందరికి ఎంతగానో ఉపచారము చేసిరి (అ.కా. 28:1-10). కావున సువార్తికులకు ఉపచారము చేయుట ఒక గొప్ప యాగమై యున్నది.

"ఉపచారము" అను పదము పరిశుద్ధగ్రంధమందు చాలా ప్రాముఖ్యత కలిగియున్నది. దైవసేవకులు చేయు బోధ "వాక్యపరిచర్య" యని, దైవసేవకులకు చేయు పరిచర్యను "ఉపచారము" అని అందురు. ఉపచారము అను పదము క్రొత్త నిబంధనయందు 17 సార్లు పేర్కొనబడినది. ఉదా :- (1) "యేసునకు ఉపచారము చేయుచు గలిలయనుండి ఆయనను వెంబడించిన అనేకమంది స్త్రీలు అక్కడ దూరమునుండి చూచుచుండిరి....." (మత్తయి 27:55,56).

హెబ్రీ గ్రంధకర్త యీ ఉపచారమును గూర్చి యిట్లు చెప్పుచున్నాడు: "మీరు చేసిన కార్యమును, మీరు పరిశుద్ధులకు ఉపచారము చేసి యింకను ఉపచారము చేయుచుండుట చేత తన నామమును బట్టి చూపిన ప్రేమను మరచుటకు, దేవుడు అన్యాయస్థుడు కాడు" (హెబ్రీ 6:10). దీనిని బట్టి తేలిన సారాంశమేమన దేవుని సాన్నిధ్యము చేరుటకు వాక్య పరిచర్య మొదటి మెట్టయితే; ఉపచారము

చేయుట రెండవ మెట్టని తలంచవచ్చును. ఉపచారము అను విషయములో మనము మంచి సమరయుని ఆదర్శముగా తీసికొనుట ఎంతయినా అవసరం (లూకా 10:30-37 చూడుము).

కావున ప్రియులారా! మనము నలిగి విరిగిన హృదయము ద్వారా నిత్యము యాగముచేసి పరలోక భాగ్యము పొందవేడుకొనుచున్నాను.

**- G. మార్కు, నందిగామ.**

## స్థిరము - అస్థిరము

క్రీస్తునందు ప్రియ సహోదరులకు వందనములు. ప్రభువుయొక్క ప్రేమతో భద్రము  చేయబడి పిలువబడినవారికి శుభమని చెప్పి వ్రాయునది. (యూదా 1వ). ఈ లోకము శాశ్వతము కాదని అందరికి తెలుసు. ఈ దేహము స్థిరము కాదు అని అంటూనే ఉంటారు. అయితే స్థిరము కాని ఈ దేహమును ఎక్కువ ప్రేమిస్తారు. అస్థిరమైన ఈలోకాన్ని అమితముగా ప్రేమిస్తారు ఎవడైనను ఈ లోకమును ప్రేమించిన యెడల తండ్రిప్రేమ వానిలో ఉండదు (1యోహాను 2:15). భక్తుడైన దావీదు తన కీర్తన 39:5-6 వాక్యములో ఈ విధముగా పాడినాడు. నా దినముల పరిమాణమును నీవు బెత్తెడంతగా చేసియున్నావు. నీ సన్నిధిని. నా ఆయుష్కాలము లేనట్టు యున్నది. ఎంత స్థిరుడైనను మనుష్యుడు ప్రతివాడును కేవలము వట్టి ఊపిరివలె ఉన్నాడు. కీర్తన 49:12 వాక్యము ద్వారా ఘనత వహించిన వాడైనను మనుష్యుడు నిలువజాలడు వాడు నశించు మృగములను పోలినవాడు అని గ్రహించుకొనగలము.

స్త్రీ కనిన నరుడు కొద్ది దినములవాడై మిక్కిలి బాధ నొందును పువ్వు వికసించినట్లు వాడు పెరిగి వాడిపోవును. నీడ కనబడక పోవునట్లు వాడు నిలువక పారిపోవును (యోబు 14:1-2). భక్తుడైన పేతురు ద్వారా ప్రభువు పలికించిన

మాట సర్వశరీరులు గడ్డిని పోలినవారు. (1పేతురు 1:24). మీ జీవమేపాటిది. మీరు కొంతసేపు కనబడి అంతలోనే మాయమైపోయే ఆవిరి వంటివారు కారా (యాకోబు 4:4). ఇట్టి అస్థిరమైన దేహములోనున్న ఈ మానవుని దేవుడు ప్రేమించినాడు. ఈ మానవునిపై దృష్టిని పెట్టినాడు. కీర్తన 144:3-4లో యెహోవా నీవు నరులను లక్ష్యపెట్టుటకు వారు ఏపాటివారు. నీవు వారిని, ఎన్నిక చేయుటకు మనుష్యులు ఏపాటివారు. నరులు వట్టి ఊపిరిని పోలియున్నారు. వారి దినములు దాటిపోవు నీడవలెనున్నవి. నీవు వాని జ్ఞాపకము చేసికొనుటకు మనుష్యుడు ఏపాటివాడు. నీవు నరపుత్రుని దర్శించుటకు వాడేపాటివాడు (కీర్తన 8:4). అయినా దేవుడు యీ నరునిపై దృష్టి పెట్టి దీనిని జ్ఞాపకము చేసికొన్నాడు.

మనము దీనదశలో నున్నపుడు ఆయన మనలను జ్ఞాపకము చేసికొనెను (కీర్తన 136:23). ఆయన కృప నిరంతరముండును. శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను. గనుక విడువక నీయెడల కృప చూపుచున్నాను (యిర్మియా 31:3). మనపై తనకున్న ప్రేమను ఋజువు పరచుచున్నాడు. ఎట్లనగా మనమింకా పాపులమై యుండగానే క్రీస్తు మన పాపముల నిమిత్తము చనిపోయెను (రోమా 5:8). ఎందుకనగా మనము అస్థిరమైన లోకములో ఉండగానే. స్థిరమైన తన లోకానికి తన రాజ్యానికి వారసులుగా చెయ్యాలి. అందుకే దేవుడు తన రాజ్యాన్ని తన స్తిమితమైన సింహాసనాన్ని వదలి తన ఆకారాన్ని మార్చుకొని కన్య మరియ గర్భం ద్వారా లోకమునందు జన్మించి, జీవించి, మరణించి, సమాధి చేయబడి మూడవ రోజున లేచినాడు, అయితే ప్రభువు నమ్మ తగినవాడు ఆయన మిమ్మును స్థిరపరచి దుష్టత్వము నుండి కాపాడి. మిమ్మును తన స్థిరమైన తవ రాజ్యములో చేర్చును (2థెస్స 3:3). కాబట్టి మీరు యీ దేహములోనుండగా యేసుక్రీస్తు దేవుని కుమారుడు అని నమ్మి బాప్తిస్మము పొందినట్లయితే ఆయన తన రాజ్యములో చేర్చును.

- V.V. రాఘవులు, మెట్టలంక.

# నిత్యజీవము

## (Eternal Life )

మానవుడు ఎన్ని సంవత్సములు జీవించినప్పటికిని, ఒక సమయములో ఈ లోకమును విడిచిపెట్ట వలెనను విషయం బైబిలు మనకు తెలియజేయుచున్నది. ఈ లోకమును విడిచిన మానవులు ఎక్కడికి వెళ్ళగలరు ? అనే ప్రశ్నవేస్తే పరిశుద్ధ గ్రంధము చూచి కొన్ని సత్యములను మనము తెలిసికొనవలసియున్నది.

సర్వోన్నతి గల దేవుడు సృష్టినంతటిని చేసిన తరువాత సృష్టిని ఏలడానికి నరుని చేసాడు.

"దేవుడు తన స్వరూమందు తన పోలిక చొప్పున, నరులను చేయుదము వారు సముద్రపు చేపలను, ఆకాశ పక్షులను, పశువులను, సమస్త భూమిని, భూమిమీద ప్రాకు ప్రతి జంతువులను ఏలుదురు గాక అని పలికెను" (ఆది.కా. 1:26).

దేవుని పోలికగా పుట్టిన మానవుడు అపవాది మాటలకు లోబడి పాపము చేసినందువలన "ఆయన ఆదాముతో నీవు నీ భార్య నా మాట విని తినవద్దని నేను నీకాజ్ఞాపించిన వృక్షఫలములు తింటివి గనుక నీ నిమిత్తము నేల శపించ బడినది. ప్రయాసముతోనే నీవు బ్రతుకు దినములన్నియు దాని పంట తిందువు. అది ముండ్ల తుప్పలను, గచ్చపొదలను నీకు మొలిపించును. పొలములోని పంట తిందువు. నీవు నేలకు తిరిగి చేరువరకు నీ ముఖపు చెమట కార్చి ఆహారము తిందువు. ఏలయగా నేలనుండి తీయబడితివి. నీవు మన్నే గనుక తిరిగి మన్నై పోదువని చెప్పెను" (ఆది.కా. 3:17).

ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తుయేసు నందు నిత్యజీవము (రోమా 6:23).

నిత్యజీవము అనగా! నిరంతము జీవించుట. "అద్వితీయ సత్యదేవుడనైన నిన్నును, నీవు పంపిన యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము" (యోహాను 17:3). "మనము సత్యవంతుడైన వానిని ఎరుగవలెనని దేవుని కుమారుడు వచ్చి మనకు వివేకమును అనుగ్రహించి యున్నాడని యెరుగుదుము. మనము దేవుని కుమారుడైన యేసుక్రీస్తునందున్న వారమై సత్యవంతుని యందున్నాము. ఆయనే నిజమైన దేవుడును, నిత్యజీవమునై యున్నాడు" (1యోహాను 5:20).

"దేవుడు మనకు నిత్యజీవమును దయచేసెను ఈ జీవము ఆయన కుమారునియందున్నది. దేవుని కుమారుని నామమందు విశ్వాముంచు మీకు నిత్యజీవము గలదని తెలిసికొనుచున్నాము. నేను ఈ సంగతులను వ్రాయుచున్నాను" (1యోహాను 5:11,13).

"దేవుని కుమారుని అంగీకరించు వాడు జీవము గలవాడు. దేవుని కుమారుని అంగీకరింపనివాడు జీవము లేనివాడే" (1యోహాను 5:12).

"ఆయనలో జీవముండెను. ఆ జీవము మనుష్యులకు వెలుగైయుండెను. ఆ వెలుగు చీకటిలో ప్రవేశించుచున్నది గాని చీకటి దానిని గ్రహింపకుండెను" (యోహాను 1:4-5).

"మనకు జీవమైయున్న క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీరును ఆయనతో కూడ మహిమయందు ప్రత్యక్ష పరచబడుదురు" (కొలస్స 3:4).

"అందుకు యేసు-పునరుత్థానమును, జీవమును నేనే, నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రతుకును, బ్రతికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు ఈ మాట నమ్ముచున్నావా ?" (యోహాను 11:25-26).

- దుగ్గిపోగు సుభాకరరావు, విజయవాడ.

# సంక్షిప్త వార్తలు

1998 అక్టోబరు 23వ తేదీ శుక్రవారం ముమ్మిడివరం మండలం కొత్తూరు జగన్నాధపురంలో ఒకరోజు సువార్త కూటము జరిగెను. ఆ కూటమునకు సోదరులు జాషువా గూటం గారు సతీసమేతముగా హాజరై వాక్య పరిచర్య చేసిరి. కూటమునకు ముందు స్థానిక సంఘము నిర్మించుకొనిన ప్రార్ధనా స్థలమును జాషువా గారు రిబ్బను కత్తిరించి తెరచిరి.

సోదరులు డి.ఇశ్రాయేలు రాజుగారు కొత్తూరు జగన్నాధపురంలోను, కొండుకుదురు గ్రామంలోను పరిసర ప్రాంతములలోను వాక్యపరిచర్య చేయుచున్నారు. కె.జగన్నాధపురంలో ఇప్పుడున్న క్రీస్తుసంఘము రెండు సంవత్సరముల క్రితము ఆరుగురు సభ్యులతో ఆరంభమైనదని, అది క్రమముగా అభివృద్ధి జెందుచు 28 మందికి పెరిగినదని ఇశ్రాయేలు రాజుగారు వివరించిరి. మరీ ముఖ్యముగా ఉన్న సభ్యులందరు హైందవులలో నుండి మార్పుజెంది క్రైస్తవులు అయ్యారని ఆయన వివరించారు. ఈ కూటమునకు దేవగుప్తంలో వాక్యపరిచర్య చేయుచున్న సోదరులు యన్.ఏలియా గారు కూడ హాజరై సాయంకాలమందు జరిగిన సువార్త కూటములో చక్కని వర్తమానమునందించిరి. సోదరులు దొగ్గా సామ్యేలు గారు పాటలు నడిపించుటలోను, ప్రార్ధన చేయుటలోను సహకరించిరి. ఉదయకాలపు కూటము అనంతరం నలుగురు స్త్రీ పురుషులు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

అక్టోబరు 30వ తేదీ శుక్రవారం రాజమండ్రికి సమీపంలోనున్న శ్రీకృష్ణ పట్టణం గ్రామంలో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును సోదరులు జాషువా గూటం గారు రిబ్బను కత్తిరించి తెరచిరి. ఆనాడు జరిగిన కూటమునకు స్థానికులు, రాజమండ్రి నగరము మరియు పరిసర ప్రాంతములనుండి వచ్చిన సువార్తికులు హాజరైరి. యేడిద నుండి వచ్చిన సోదరులు యన్.రాజారావ్ గారు ప్రార్ధన చేయగా ఆలయమును జాషువా గారు తెరచిరి. అనంతరం ఆలయములో జరిగిన కూటములో సోదరులు యన్.రాజారావ్ గారు, జాషువా గూటం గార్లు వాక్యపరిచర్య చేసిరి. సోదరులు యమ్.కిరణ్‌కుమార్ (రాజమండ్రి) గారు కూటముకు అధ్యక్షత వహించి సమస్తమును చక్కగా నడిపించిరి. సోదరులు ఆగమనరావ్, ఇశ్రాయేలు గార్లు ప్రార్ధన చేయుటలో సహకరించిరి.

శ్రీకృష్ణ పట్టణంలో సోదరులు పి.సైమన్ గారు పలు సంవత్సరములుగా వాక్యపరిచర్య చేయుచు అనేకులను నూతననిబంధన క్రైస్తవ్యములోనికి మార్చగల్గిరి. సైమన్ గారి విశ్వాసము, పట్టుదల వలన ఆ గ్రామములో క్రీస్తుసంఘము కొరకు చక్కటి ఆలయము నిర్మించబడియున్నది. దేవుడు సర్వాంతర్యామి గనుక ఆయనను మనం ఆలయమునకు పరిమితి చేయలేమనియు, క్రీస్తు యొక్క సంఘమే దేవుని ఆలయము (మందిరము) అనియు, క్రైస్తవులు కూడి రాగా క్రీస్తు వారి మధ్య యుంటారనియు, క్రీస్తుసంఘము నిర్జీవమైన వస్తువులచే గాక సజీవమైన రాళ్లతో (క్రైస్తవులతో) నిర్మింపబడినదనియు సోదరులు హెచ్చరించారు. కూటము అనంతరం సోదరులు పి.సైమన్‌గారు వందన సమర్పణ చేసిరి. తదుపరి హాజరైన వారందరికీ స్థానిక సంఘము ప్రేమవిందు ఏర్పాటు చేసిరి.

అక్టోబరు నెలలో కోస్తా ఆంధ్రాలో భారీ వర్షాలు కురియుట వలన ఆయా గ్రామములకు, సంఘాలకు తీవ్రనష్టము సంభవించినది. తత్ఫలితముగా అక్టోబరు నెలలో జొన్నలగరువులో జరుగవలసిన సువార్తికుల సదస్సు నవంబరు ఆఖరి వారమునకు వాయిదా వేయబడినది.

Edited & Published by Joshua Gootam & Printed by him at
Satya Vani Publications, Kakinada - 533 004

PRINTED BOOK - BOOK POST

From:

SATYA WAKKU
P.O. BOX 80,
KAKINADA - 533 001

To